
# సౌందర్యం!



* రచన : శ్రీ చింతలూరి మల్లిబాబు *

(గతసంచిక తరువాయి)

చెల్లాచెదరైన తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులు ఆమె నుదిటిపై తమాషాగా నృత్యం చేస్తూన్నాయి. కలువ రేకులమీది తుషార బిందువులులా చెక్కిళ్ళమీద జలకణాలు మెరుస్తున్నాయి. చెవులకి పెద్దపెద్ద రింగులు సింగారం సమకూర్చుస్తున్నాయి. బిందె కానుకున్న ఉన్నతమైన వక్షం మరింత ఉద్వేగంతో ముందుకుబుకుతోంది. అందమైన సన్నటి నడుం, విశాలమైన జఘనం, వింత ఆకర్షణ ఒనగూరుస్తున్నాయి. ఆ యువతి రూపురేఖలు, నడకవైవిధ్యం, మూర్తి భంగిమ చూస్తుంటే క్రమక్రమంగా ఏదో అపూర్వమైన భావావేశం అతనిలో కలిగించి. అతని కళాహృదయం ఉద్వేగంతో ఊగిపోయింది అప్రయత్నంగా. అద్భుతమైన అందంతో భాసిస్తున్న ఆ సంధ్యాసమయంలో, అంతకంటె అద్భుతమైన శోభలతో దీపిస్తున్న ఆ వాతావరణంలో, మరీ అంతకంటె అత్యద్భుతమైన అందంతో అలరారుతున్న ఆ అపరిచిత యువతివైపు అలాగే చూస్తూ నిలుచుండిపోయాడు అతను. బాపూ బొమ్మలా, రవివర్మ చిత్రంలా, అజంతా శిల్పంలా, కాళిదాసు శకుంతలలా, కృష్ణశాస్త్రి ఊర్వశిలా, విశ్వనాథ కిన్నెరసానిలా, నండూరి ఎంకిలా బాపిరాజు శశికళలా, అపురూపంగా—అసాధారణంగా, విలక్షణంగా, వినూత్నంగా, ముగ్ధగా, మోహనంగా ఆమె అలా-అలా పైకి వస్తూంది మెట్లమీదుగా మందగమనంతో.

ఇంతలో అకస్మాత్తుగా కాలే జారిందో, బిందే పట్టు తప్పిందో ఆమె తూలి జారి పడబోయింది. వెంటనే అది గమనించి ఒక్క అంగతో ఆమె వద్దకుచేరి అతిచేరువలో వున్న ఆ యువతిని పడిపోకుండా పొదివిపట్టుకున్నాడు—సుధాంశు. ఆ సమయస్ఫూర్తి ఆ సాహసం ఎలా వచ్చాయో గాని ఆమెను పడకుండా పట్టుకుని ప్రమాదంనుంచి రక్షించాడు. సురక్షితంగా గట్టుమీదకి చేర్చాడు.

ఆ యువతి భయంనుండి తేరుకుని, సుధాంశు వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి, ముందుకు సాగిపోయింది. అలా వెళ్ళిపోతున్న ఆ సౌందర్య రేఖవైపు అలాగే చూస్తూండిపోయాడు కొంతసేపు సుధాంశు.

ఆ తరవాత ఇసుకలోకి వెళ్ళిపోయి కూర్చుని ఉత్తేజంతో కుంచె తీసుకుని చిత్రం గీయడం మొదలుపెట్టాడు చకచకా తన నోటుబుక్కులో సుధాంశు.

తల్లిబిల్లిగా అలవోకగా గీయబడ్డ రేఖలన్నీ క్రమంగా ఒక పరిణామం చెంది, ఒక సుస్నిగ్ధ స్త్రీ మూర్తిగా రూపు దిద్దుకున్నాయి. అతను అత్యంత వేగంగా, అప్రయత్నంగా ఆ రేఖాచిత్రాన్ని గీశాడు. ఆ చిత్రంలో ఇంతకుముందు తను దర్శించిన నీళ్ళ సుందరి రూపచ్ఛాయలే స్పష్టంగా దర్శనమిస్తున్నాయి. సుదాంశు పడుచు హృదయం ఏదో నూతనానందంతో మరేదో అనూహ్యమైన సంతృప్తితో పూర్తిగా నిండిపోయింది.

మరుసటిరోజు మళ్ళీ సంధ్యాసమయానికి క్రితం రోజు

అతనికి తారసిల్లిన నీళ్ళ సుందరి—ఆ యువతి అతనికి అదే మెట్లదగ్గిర ప్రత్యక్షమైంది. ఆమె అతన్ని చూసి స్నేహ పూర్వకంగా నవ్వింది.

సుధాంశు కూడా అందుకు సమాధానంగా చిరునవ్వు నవ్వాడు.

'నిన్న మీరు నన్ను కాపాడారు. లేకపోతే నేను క్రింద పడిపోయేదాన్ని. ఏం ప్రమాదం జరిగేదో! అదృష్టవశాత్తు సమయానికి మీరక్కడుండి నన్ను రక్షించారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో!' అంది ఆ యువతి ఎంతో ఆత్మీయతతో.

అతనికి వెంటనే జవాబు స్ఫురించలేదు. 'ఇందులో నా గొప్పతనమేముంది? ఏదో సమయానికి అడ్డుపడ్డాను. అందువల్ల మువ్వు పరిచయమయ్యావు. అది నా అదృష్టం!' అన్నాడు సుధాంశు.

ఆమె ప్రసన్నంగా నవ్వింది. ఆ నవ్వులో ఒక సన్నని సిగ్గుతెర దోబూచులాడింది.

'నీ పేరు?' అడిగాడు సుధాంశు.

'రత్నబాల' ఆమె సమాధానం.

తరవాత ఆమె అడిగింది అతని వివరాలు. అతడు తన పేరు, వివరాలు చెప్పాడు.

'సుదాంశు పేరు బాగానే వుందండి! కాని ఉచ్చరించడం కొంచెం కష్టంగా వుంటుందేమో!' అంది ఆమె.

'అలాగయితే సుధా అని పిలవొచ్చు. మా వాళ్ళు అలాగే పిలుస్తారు కూడా!' అతను సమాదానం చెప్పాడు.

ఆ విధంగా వాళ్ళిద్దరికీ పరిచయం పెరిగి సాన్నిహిత్యం ఏర్పడింది.

ఒకసారి తన చిత్రాలు చూడడానికి ఆమె తన నివాసానికి ఆహ్వానించాడు సుదాంశు.

ఆమె అనుకున్న సమయానికి అతని నివాసానికి వచ్చింది.

అతను తను వేసిన చిత్రాలన్ని ఆమెకు చూపించాడు.

అతని కళాప్రతిభకి ఆమె పొంగిపోయింది. సుదాంశు ప్రస్తుతం వేస్తున్న ఒక చిత్రం ఆమెని బాగా ఆకర్షించింది. అది ఏటినుండి చంకన బిందెతో వయ్యారంగా నీళ్లు తీసుక వస్తున్న కన్య చిత్రం! అందులో అస్పష్టంగా కనిపిస్తున్న

WITH BEST COMPLIMENTS FROM :




Phone : 24010
9, K. N. P. Colony
Dharapuram Road, TIRUPUR-638 608

తన రూపం గమనించి మురిసిపోయింది. ఆ చిత్రాన్ని త్వరలో పూర్తిచేయమని అతన్ని కోరింది.

ఆ చిత్రాన్ని పూర్తిచేసిన తర్వాత సుదాంశు రత్నబాలని మళ్ళీ తన నివాసానికి పిలిచాడు. ఆమె వచ్చి ఆ చిత్రం చూసి ముగ్ధురాలైంది. అతన్ని ఎంతగానో అభినందించింది. ఆ ఆనందపారవశ్యంలో రత్నబాల ఎంతో మనోహరంగా కనిపించింది సుదాంశు కళ్ళకు. అతనికి ఆమెను మోడల్‌గా వుంచుకొని ఒక చిత్రం గీయాలనిపించింది. ఆ విషయం ఆమెతో చెప్పాడు. ఆమె వెంటనే అంగీకరించింది.

ఆమెను పెరట్లో ఒక చెట్టుకానుకొని వయ్యారంగా నిలబడమని చెప్పి, తనకు కావలసిన భంగిమకోసం ఆమెను ఆయత్తం చేయడం సాగించ్గాడు. మొదటగా ఆమె ముంగురులు సవరించి, తరువాత పైట సర్దబోయాడు. ఆ ప్రయత్నంలో అనుకోకుండా అతని చేతులు ఆమె ఎత్తయిన గుండెల్ని తాకి అక్కడే ఆగిపోయాయి. ఆ వ్రేళ్ళ క్రింద మెత్తని గుండ్రని ఎత్తులు అయస్కాంతాల్లా ఆకర్షిస్తున్నాయి. అంతే! ఆ చేతులు అక్కడే నిలిచిపోయాయి. ఆమె సౌందర్య శిఖరాల పరిమణాల్ని, పొంకాన్ని స్పృశిస్తూ అలాగే అనూహ్యంగా, అచేతనంగా వుండిపోయాడు. ఆమెకూడా కొంతసేపు అలాగే మౌనంగా వుండిపోయి అక్కడనుంచి ఆ తరువాత వెంటనే కదిలి వెళ్ళిపోయింది. అతను ఒక్కసారి బాహ్యలోకి వచ్చి తన ప్రవర్తన తనకే ఆశ్చర్యమనిపించి, అలాగే దిక్కులు చూస్తూ నిలబడిపోయాడు.

ఆ తరువాత రత్నబాల అతనికి తటస్థపడలేదు. మౌనంగా, ముభావంగా దూరదూరంగా వుండిపోయింది. సిగ్గో–కోపమో అర్థమయ్యేదికాదు ఆమె భావం సుదాంశుకి. ఈ పరిస్థితికి అతను తల్లడిల్లిపోయాడు. దీని కంతటికీ కారణం ఆ రోజు తన ప్రవర్తనే కారణం కావచ్చు. అతనికిటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. ఆ రోజులా


"కథాంజలి" స్వర్ణోత్సవ సంచికకు మా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు!

LAKSHMI
WET GRINDERS
No. 1 for the past 23 years



MANUFACTURED BY
SRI LAKSHMI INDUSTRIES
56 DEVANGA HIGH SCHOOL ROAD
COIMBATORE - 641 002 PHONE: 31689

శ్రీ లక్ష్మీ వారి
వెట్ గ్రైండర్స్

గత
25 సంవత్సరాల నుంచీ
ప్రసిద్ధి చెందినది.

మునుపెప్పుడూ ఎవరితోనూ, అమపుతప్పి ప్రవర్తించలేదు. అందుకు కారణం ఆమె అందం-ఆకర్షణ-ఆమెమీది అనురాగం-ఆరాధనాభావం మాత్రమే! ఆ రోజు ఏకాంతంలో ఆమె వక్షోజాలమీద తన చేతులు పడగానే అప్రయత్నంగానే ఆ సున్నిత భాగాల్ని స్పృశించాలనిపించింది. అంతే! స్పృశించకుండా వుండలేకపోయాడు. అందువల్ల ఆమె అభిమానమే దెబ్బతిన్నదో, ఆశాభంగమే చెందిందో అప్పటినుంచే అతన్ని మౌనంగా, నిశ్శబ్దంగా శిక్షించడం మొదలుపెట్టింది. ఆమెను ఒంటరిగా కలుసుకొని, ఆనాటి తన మనోస్థితిని ఆమెకు వివరించి, మన్నించమని కోరుదామని అతను ప్రయత్నించాడు. కాని ఆమె ఆ అవకాశం యివ్వలేదు.

సుదాంశు తరువాత తన స్వస్థలం తిరిగి వచ్చాడు. రత్నబాల కోసం ఆవేదన చెందుతూ, అశాంతితో గడుపుతూ, అదేపనిగా చిత్రాలు వేయడం సాగించాడు. ఎన్నో స్త్రీ రూపాలు చిత్రించాడు. అన్నిటిలోనూ లీలగా రత్నబాల రూపమే సాక్షాత్కరించేది.

రత్నబాల ఎప్పుడో ఒకప్పుడు తనకు జీవితంలో తటస్థపడుతుందనీ, ఆమెకోసం అహోరాత్రులు తపించి గీచిన ఇన్ని చిత్రాలూ ఆమె తిలకించి, తనపై కోపం విరమించుకుని, తన ప్రేమ హృదయాన్ని అర్థంచేసుకుని అనురాగం వర్షిస్తుందనీ, సుధాంశు ఎంతగానో ఎదురు చూశాడు. కాని ఆమె ఇంతవకూ అతనికి కనిపించలేదు. ఎక్కడుందికూడా తెలియలేదు. రత్నబాల తన కుటుంబంతోపాటు ఆ గ్రామం నుంచి ఎక్కడికో వెళ్ళిపోయింది. అతని వ్యధ తొలగిపోలేదు. ఆమెని మరిచిపోలేకపోయాడు. ఆమెకోసం అన్వేషించకుండా వుండలేకపోయాడు.

ఆ అశాంతినుంచి, ఆ ఆవేదననుంచి ఊరట చెందడం కోసం అసంఖ్యాకంగా చిత్రాలు చిత్రించాడు. అదొక కరంతర క్రియగా, కళా తపస్సుగా పరిణమించింది. అలా చిత్రించిన అనేక చిత్రాల్లోంచి తనకు అత్యుత్తమమైనదిగా ఇష్టమైనదిగా కనిపించిన ఒక చిత్రాన్ని ఎన్నికచేసి, దాన్ని 'సౌందర్యం' అనే పేరుతో ఆసారి ఆ పట్నంలో ఏర్పాటు చేసిన ఆ చిత్రకళా ప్రదర్శనంలో ప్రప్రథమంగా ప్రదర్శించాడు.


## 'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్స్ ఎ హబీబీర్ రహమాన్ అండ్ సన్స్, గుడియాత్తం వారు ఉత్పత్తి చేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ ఫైర్సులో వీటిని ప్రదర్శనములకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్ ఫైర్) స్వీడన్, బెల్జియం సింగపూరు మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలో కూడా వీటిని ప్రవేశపెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారు చేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టె వంటి పాకెట్లో కొత్త రూపు, అందచందాలు కూడా ఏర్పడ్డాయి.

అద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

With Best Compliments from :

మీ కొరకు ....

మేము

తయారిస్తున్న

SNH

శ్రీ నిత్యా బనియన్లు

* బనియన్లు

* జెట్టీలు

* ఫేన్సీ కలర్ రకాలు

: తయారించువారు :

**SRI NITHYA HOSIERIES**

11-C, Ramaiah Colony
TIRUPUR-638 602.

Stockists :

**G. K. Banians**

Vastralatha, Vijayawada-520 001.

ఆ ప్రదర్శనలో ఆ చిత్రం ప్రముఖస్థానం ఆక్రమించింది. ప్రేక్షకుల్నీ కళానిర్ణేతల్నీ అది విపరీతంగా ఆకర్షించింది. కాని అందులో గొప్ప భావనగానీ, సాంఘిక ప్రయోజనంగానీ లేవని దానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులో దేనినైనా యివ్వడానికి వీలుపడదనీ భావించారు. కాని కళాత్మకంగా ఆ చిత్రం ఏ ఒక్క బహుమతి పొందిన చిత్రానికీ తీసిపోదని గ్రహించారు. ఆఖరుకు ప్రత్యేక బహుమతి యివ్వడానికి నిర్ణయించారు.

ఆ విషయం తెలిసిన సుధాంశు ఎంతో ఉప్పొంగిపోయాడు. ఈ సంతోషసమయంలో రత్నబాల ఈ విజయ ప్రకటనా సందర్భంలో ఇక్కడ వుంటే ఎంత బాగుండును అనుకున్నాడు అతను. కాని ఆ అదృష్టం లేదని అతనికి తెలుసు. అందుకే అతను అంత ఆనందంలోనూ కించిత్ విచారగ్రస్తుడయ్యాడు.

చివరి రోజు ప్రేక్షకులు అధికంగా వచ్చారు. చిత్ర ప్రదర్శనం తిలకిస్తున్నారు. సుదాంశు తన చిత్రానికి కొంచెం దూరంలో నిలబడి ప్రేక్షకుల స్పందనని గమనిస్తున్నాడు.

ఇంతలో నలుగురైదుగురు ఆడవాళ్ళు అక్కడికి వచ్చారు. వాళ్ళు అలంకరణలో, హావభావాల్లో ఉన్నత వ్యక్తుల్లా కనిపిస్తున్నారు. వాళ్ళు సరాసరి సుధాంశు చిత్రం వద్దకువచ్చి అక్కడ ఆగిపోయారు. అందులో ఒకామె ఆ చిత్రాన్ని తదేకంగా చూస్తూ అలాగే నిలబడిపోయింది. ఆమె తన వన మయూరిలా సౌందర్యంతో వెలిగిపోతోంది. ఆమెలో రత్నబాల పోలికలు కనిపిస్తున్నాయి. ఆమె ఇప్పుడు నిండుగా, నిరుపమానమైన సోయగంతో నీటుగా కవిపిస్తోంది. కళ్ళు విప్పార్చుకుని పరిశీలనగా చూశాడు. సందేహం లేదు. ఆమె రత్నబాలే! తన రత్నబాలే! ఆమె ఆ చిత్రం పరిశీలించి తరువాత దృష్టి మరల్చి, ఎవరి కోసమో చుట్టూ ఆతృతగా పరికించింది. ఇంతలో ఆమె వైపే చూస్తున్న సుధాంశు కనిపించాడు. ఆమె కళ్ళు ఏదో కొత్త కాంతితో మిలమిల మెరిశాయి.

'హలో సుధాంశుగారా? బాగున్నారా? ఎన్నాళ్ళకు మీ దర్శనం?' అంది ఎంతో చనువుగా.

'ఎవరు? రత్నబాలా?' అప్రయత్నంగా అతని నోటివెంట

మాటలు వెలువడ్డాయి.

'కంగ్రాచ్యులేషన్సు సుధాగారూ!' ఆమె అభినందనలు తెలిపింది.

'థాంక్సు!'

'మీకీ బహుమతి రావడం నాకు చాలా ఆనందంగా వుంది. మీ చిత్రంకూడా చాలా బావుంది' అందామె హర్ష పులకిత కంఠంతో, కించిత్ సిగ్గుతో.

'ఏదో మీకు నచ్చింది. అంతేచాలు' అన్నాడు సుధాంశు.

'నేను ఈ ప్రక్క టౌన్లోనే ఒక కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా. చిత్రకళా ప్రదర్శనమంటే చూద్దామని వచ్చా! వచ్చినందుకు మీరు కనిపించారు. చాలా అదృష్టం. మీ కభ్యంతరం లేకపోతే ఈ అడ్రస్‌కు వచ్చి నన్ను కలుసుకోండి' అని రత్నబాల తన బ్యాగ్‌లోంచి విజిటింగ్ కార్డు తీసి అందిస్తూ.

అందులో ఇలా వుంది—

కుమారి రత్నబాల, లెక్చరర్, ఆ తరవాత ఆ కాలేజీ పేరూ, ఆ పట్నం పేరూ వున్నాయి.

'తప్పకుండా రండి మీ కోసం ఎదురు చూస్తాను' అంది అర్థింపుగా ఆ సౌందర్యదేవత.

'అలాగే తప్పకుండా వస్తాను' అన్నాడు సుధాంశు.

ఆమె అతనివైపు ఆర్ద్రంగా చూస్తూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

సుధాంశు ఆమెవైపూ, ఆ చిత్రంవైపూ మార్చిమార్చి చూస్తూ సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇంతవరకు అతని అంతర్యంలో అవ్యక్తంగా చోటు చేసుకున్న విషాద రేఖ తొలిగిపోయింది. అతని హృదయంలో ఏదో క్రొత్త వెలుగు వెలిగింది.

ఎదురుగా తన 'సౌందర్యం' చిత్రంనుంచి రత్నబాల వన మయూరంలా నాట్యం చేస్తూ వచ్చి, తనని ఆదరంగా అనురాగ పూర్వకంగా ఆలింగనం చేసుకుంటున్నట్లు అతను అనుభూతిని పొందుతున్నాడు. మళ్ళీ సుధాంశులో ప్రేమ స్వప్నం తొణికింది.

ఇంతలో అతనికి చైతన్యం కలిగింది. లోగడ యిలా స్వప్నలోకంలో విహరిస్తూ నిగ్రహం కోల్పోయి, ఆమెపట్ల అలా ప్రవర్తించడంవల్ల ఆమె ఆగ్రహించి, తనకి దూరమయింది. మళ్ళీ ఈనాడు అలా నిగ్రహం కోల్పోయి, పాత కథని పునరావృత్తం కానీయకూడదు. కళాకారునికి సౌందర్యాన్ని చూసి స్పందించి ప్రేరణపొందే సున్నిత హృదయం వుండవలసిందే. కాని నిగ్రహం కోల్పోయి తన కర్తవ్యం మరచి అన్యధా ప్రవర్తించడం ఉచితంకాదు. తన ఈ 'సౌందర్యం' చిత్రంలాగే రత్నబాలని కూడా ఒక చిత్రంగానే భావించి, ఆమె సౌందర్యంలోని కళాత్మకతని అవలోకించి, ఆనందించాలే తప్ప, హస్తాల్లోకి తీసుకుని అనుభవించాలని భావించకూడదు. గట్టిగా నిర్ణయం చేసుకున్నాడు సుధాంశు మనసులోనే. రత్నబాల తనకి ఆరాధ్య దేవత! అంతేగాని అనుభవాత్మక మూర్తిగాదు అనుకున్నాడు దృఢంగా సుధాంశు మరోసారి. ✱




# కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

ఒక ప్రతి ... 80 పైసలు

సంవత్సర చందా ... రూ. 18-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో దొరుకును.

**కథాంజలి**

నెం. 10, మురుగేశముదలి వీధి,

మదరాసు-600 079.